ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 14 జూలై 2024



ఘనంగా జగన్నాథ రథయాత్ర 7

యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి 8



22 ఏళ్లుగా ఎదురుచూపులు

ఉద్యోగ భద్రత లేక ఈసీ ఏఎన్ఎంల అవస్థలు

మూడు నెలలుగా అందని వేతనాలు

డిమాండ్‌లు నెరవేర్చాలని కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు వినతి

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత లేకపోవడం, చాలీచాలని వేతనాలతో సుమారు ఇరవై రెండు సంవత్సరాలుగా జీవనం సాగిస్తూ వైద్య ఆరోగ్య శాఖలో ఈసీ (యూరోపి యన్ స్కీం) ఏఎన్ఎంలు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డీఎస్‌సీ (డిస్ట్రిక్ట్ సెల క్షన్ కమిటీ) ద్వారా 2002 సంవత్సరంలో రూ. 3,550 వేతనంతో పలువురు ఏఎన్ఎంలు కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో చేరారు. ప్రస్తుతం వేతనం 27,399కి చేరినా కాంట్రాక్టు పద్ధతిలోనే ఇంకా కొనసాగుతున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ, ఆరోగ్య పరమైన విధులను నిర్వహిస్తున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 636 మంది ఈసీ ఏఎన్ఎంలు...

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 636 మంది ఈసీ ఏఎన్ఎంలు ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూపులతో గడుపుతున్నారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 20 మంది, సంగారెడ్డి 61, రంగారెడ్డి 48, సిద్దిపేట 36, నిజామాబాద్ 31, వికారాబాద్ 31, కరీంనగర్ 30, మెదక్ 27, కామారెడ్డి 26, సూర్యాపేట 24, హైద్రాబాద్ 23, మహబూబ్‌నగర్ 23, నాగర్‌కర్నూల్ 23, మెడ్చల్-మల్కాజ్‌గిరి 22, నల్గొండ 20, మహబూబాబాద్ 19, వనపర్తి 16, వరంగల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లాలో 16 మంది ఈసీ ఏఎన్ఎంలున్నారు.

హనుమకొండ 14, పెద్దపల్లి 14, జనగాం 12, జోగులాంబ గద్వాల్ 11, మంచిర్యాల 11, రాజన్న సిరిసిల్ల 10, ఆదిలాబాద్ 9, జయ శంకర్ భూపాల పల్లి 9, నారాయణ పేట 8, ములుగు 7, నిర్మల్ 7, ఖమ్మం 5, కొమురం భీం అసిఫాబాద్ 5, భద్రాద్రి కొత్త గూడెం 2 మంది ఈసీ ఏఎన్ఎంలు పని చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో నియామకం..

ఉమ్మడి రాష్ట్రంలో పారా మెడికల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా 2002 సంవత్సరంలో డీఎస్‌సీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. అందులో మెరిట్ పొందిన వారికి అదే యేడాది పీహెచ్‌సీలలో ఏఎన్ఎంలుగా కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2007, 2008లో అప్పటి ప్రభుత్వం సంబంధిత ఏఎన్ ఎంలను నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా యూరోపియన్ కమిషన్ స్కీంలకు బదిలీ చేసింది. 2002లో రూ. 3,550, 2008లో రూ. 5,200, 2019లో రూ. 10,200, 2018లో రూ. 21,230, 2022లో రూ. 27,399 చొప్పున వేతనాలు అందిస్తున్నారు. అయితే మూడు నెలలు నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డిమాండ్‌లు ఇవీ...

రాష్ట్రంలో నేషనల్ హెల్త్ స్కీంలో భాగంగా యూరోపియన్ కమిషన్ స్కీంలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్ఎంలను క్రమబద్ధీకరిం చాలన్న ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం ముందు ఉంచారు. ఏ నెలకు ఆ నెల వేతనాలను అందించాలని, పనిభారం తగ్గించాలని, గర్భిణులకు, చిన్నారులకు అందించే వైద్య సేవలపై ఆన్‌లైన్‌లో కాకుండా బుక్‌లో నమోదు చేసేలా వెసులు బాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైద్రాబాద్‌లో మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతిప్రతం అందించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ను సైతం కలిసి సమస్యను విన్నవిం చారు. ఇటీవల జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమీయోద్దిన్‌లను కలిసి వినతిపత్రాలను అందించారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

కోమల, ఏఎన్ఎం, వేంపల్లి, మండలం మల్లాపూర్, జగిత్యాల

గత 22 సంవత్సరాలుగా ఈసీ ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నప్పటికీ డిమాండ్‌లు పరిష్కరించడం లేదు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఈసీ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ కార్యక్రమంలో భాగస్వామ్యుల మవుతున్నాము. మా పనిని ప్రభుత్వం గుర్తించాలి. న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలి.



వెట్టి చాకిరి చేస్తున్నాము

లావణ్య, ఏఎన్ఎం, తిప్పన్నపేట, మండలం కల్లెడ, జగిత్యాల

వైద్య ఆరోగ్య శాఖలో ఈసీ ఏఎన్ఎంలుగా వెట్టి చాకిరి చేస్తున్నాము. చాలీచాలని వేతనాలు, ఎప్పుడు వేతనాలు అందుతాయో తెలవని పరి స్థితుల్లో సంవత్సరాల తరబడి కుటుంబాలను నెట్టుకొస్తున్నాము. రెండు దశాబ్ధాలకు పైగా పనిచేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వాలు మా సమస్యలను పట్టించుకోవడం లేదు. వెంటనే ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలి.





జగిత్యాలలో డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న ఏఎన్ఎంలు

సేవ చేసేందుకు లయన్స్ క్లబ్ చక్కని వేదిక

వైస్ గవర్నర్ మోర బద్రేశం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

రాయికల్, జూలై 13: నిరుపేదలకు సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ మోర బద్రేశం అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ 12వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ మోర బద్రేశం, రీజియన్ చైర్ పర్సన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై 2024-25 సంవత్సర నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కుర్మ సుదర్శన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు దాసరి గంగాధర్, బొడుగం అంజిరెడ్డి, బొమ్మకంటి నవీన్, సుధవేని మురళి, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, పారిపల్లి శివ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత సంవత్సరం నిరుపేదల కోసం 59 సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడంలో ముందు వరుసలో ఉన్న రాయికల్ లయన్స్ క్లబ్ ఆ స్థానాన్ని సుస్థిరపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, జోన్ చైర్‌పర్సన్ గడ్డం శంకర్‌రెడ్డి, ఎక్స్‌టెన్షన్ చైర్ పర్సన్ ఆడెపు మధు, గుంటుక చంద్రప్రకాశ్, ప్రవీణ్, మాజీ జోన్ చైర్ పర్సన్ రమేష్, భూమయ్య, డాక్టర్ ఉదయ్ కుమార్, ఎంజెఎఫ్ స భ్యులు ఆనందం, గంగాధర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న జిల్లా వాసికి అభినందన

జగిత్యాల అర్బన్, జూలై 13: బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, విద్యావేత్త నక్క రాజుకు డాక్టరేట్ రావడం పట్ల ట్రస్మా అధ్యక్షుడు బోయినిపల్లి శ్రీధర్‌రావుతో పాటు సంఘ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తెలంగాణ సరస్వతీ పరిషత్ ఆడిటోరియం హైద్రాబాద్‌లో ఆసియా ఇంటర్నేష నల్ రీసెర్చ్ యూనివర్శిటీ నుంచి విద్యా ఆధ్యాత్మిక రంగాలలో విశిష్ట సేవలందించిన సేవలకు గానూ డాక్టరేట్ అందినట్లు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఎన్నం కిషన్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘ అధ్యక్షులు గడ్డం రమేష్‌తో పాటు విద్యావంతులు, మేధావులున్నారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుల బాసట

మల్యాల, జూలై 13: మల్యాలకు చెందిన మ్యాదరి టీనా అనే చిన్నారి కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండడంతో తాను చదువుతున్న స్థానిక శ్రీవాగ్దేవి విద్యాసంస్థల ఉపాధ్యాయులు బాసటగా నిలిచారు. ఉపాధ్యాయులు అందరూ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు బాదిత కుటుంబసభ్యులకు శనివారంనగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత పోకల నరేష్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించేలా చర్యలు

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



ఎమ్మెల్సీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఏలు

జగిత్యాల టౌన్, జూలై 13: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించి తమకు, తమ వారసులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం జీవన్ రెడ్డి వీఆర్‌ఏల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక లేఖను రాసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 61 ఏళ్ల పైబడిన 37,97 మంది వీఆర్‌ఏల స్థానంలో దశాబ్ధకాంటా విధులు వారి వారసులు నిర్వహిస్తున్నారని వారి అర్హతకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎంకు లేఖలో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం నాయకులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మిపూర్ ప్రజలు

జగిత్యాల టౌన్, జూలై 13:డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మిపూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు శనివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద వర్గాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు అన్ని వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే లక్ష్మిపూర్ గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి మోకాలు శస్త్ర చికిత్స కోసం మంజూరైప రూ. 80 వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రావు, జాన్, సత్తి రెడ్డి, రాజి రెడ్డి, చంద్రా రెడ్డి, గంగన్న, రాజేష్ ఉన్నారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు

జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్



అంబారిపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి

జగిత్యాలరూరల్, జూలై 13 : కాలానుగుణంగా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా, జ్వరాల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట గ్రామంలో డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, ఎస్‌యూవో శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు మురళి, శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జీ, శ్రీను, ఫహీం పాల్గొన్నారు.

అంజన్న సేవలో కలెక్టర్ కుటుంబసభ్యులు



కలెక్టర్ కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

మల్యాల, జూలై 13: జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కుటుంబసభ్యులు శనివారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కలెక్టర్ సతీమణితో పాటు కుటుంబసభ్యులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

జానపద గాయకురాలికి డాక్టరేట్

జగిత్యాల టౌన్, జూలై 13: జిల్లాకు చెందిన చిందం ఆంకారపు సునీత సాహిత్య సేవ, సమాజ సేవకురాలు, జానపద గేయ రచయిత, గాయకురాలు గౌరవ డాక్టరేట్‌ను సాధించింది. స్ఫూర్తి ఇంటర్ నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ, ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలిందించిన పలువురికి గౌరవ డాక్టరేట్‌లను అందజేశారు. జిల్లాకు చెందిన సునీత సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా సునీత శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సునీతను కళాశ్రీ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కవియిత్రిలు సరోజన, అనిత, కవిత, శ్రీలక్ష్మి, కమల, లావణ్య తదితరులు సునీతకు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

జగిత్యాలరూరల్, జూలై 13 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి శ్రీ విద్య పాఠశాలలో శనివారం బోనాల పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తి చేసిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనం కోసమే ఎరువుల గోదాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ఎరువుల బస్తా రైతుకు ఇస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, జూలై 13: రైతుల ప్రయోజనం కోసం ఎరువుల గోదాంను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో జైనా సహకార సంఘం నిధులు రూ 12 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేలా ఎరువుల గోదాంను నిర్మించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంత రైతులకు ఎరువుల గోదాం ఎందో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఎరువుల నిల్వలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుక రావాలని ఆయన అన్నారు. ప్రభుత్వం త్వరలో రైతులకు రూ 2 లక్షలు రుణాలను ఎకకాలంలో మాఫీ చేస్తామని ఆయన వివరించారు. ఇటీవల ధాన్యం కొనుగోలు సమయంలో ఎలాంటి కోత లేకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయలేదని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు ప్రస్తుతం జరగకుండా పరిపాలన కొనసాగుతుందన్నారు. రైతులకు మేలు జరిగే విషయంలో పార్టీలకు అతీతంగా ఎవరు ఎలాంటి సలహాలు, సూచనలు అందిస్తే స్వీకరిస్తామని ఆయన తెలిపారు. అంతకు ముందు దొనూర్ గ్రామంలో గల వెలగల చెరువును ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఇక్కడ నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. దొనూర్ గ్రామంలోని గంగమ్మ దేవాలయాన్ని కూడ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేష్, ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, జైనా పీఏసీఎస్ సీఈవో బలుమూరి సాగర్‌రావు, వైస్‌చైర్మన్ మూల మోహన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు కుక్కల చిన్నగంగారెడ్డి, సాయిని లక్ష్మి, కళ్లెపు లక్ష్మీ-మాధవ రెడ్డి, సౌడం రాజయ్య, తాడుక తిరుపతి, భూక్యా రాజమౌళి, దండవేని గంగమల్లయ్య, అనుపురం తిరుపతి, సముద్రాల సత్తయ్య, ఆరెపల్లి మాజీ సర్పంచ్ బోర్లకుంట కమల, మాజీ ఎంపీటీసీ కుంబాల రవిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ పాల్గొన్నారు.

టీకాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి

కొడిమ్యాల, జూలై 13: చిన్న పిల్లలకు టీకాలు ఇచ్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఆకుల శ్రీనివాస్ అన్నారు. కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాచుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు ఇస్తున్న టీకాల గురించి ఏఎన్ఎంలకు తగు సూచనలు చేశారు. అనంతరం రికార్డులు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం కొండాపూర్ సబ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న ఫీవర్, డెంగ్యూ సర్వే డ్రై డేను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని, జ్వరం ఉన్నవారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డిస్పెన్సరీ, ల్యాబ్‌లను పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి అందరికీ అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్, హెచ్‌ఈవో సాగర్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

బీర్‌పూర్,జూలై 13: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో శనివారం జగిత్యాల డీఎస్పీ రఘుచంధర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో విచారణ చేపట్టారు. ఈ నెల 11న తమను కులం పేరుతో దూషించారని కామెర రాజేశ్వర్ అనే వ్యక్తి కొల్వాయి గ్రామానికి చెందిన రామకిష్టు గంగాధర్ కుటుంబ సభ్యులపై ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసు విషయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామిలు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సిబ్బంది ఉన్నారు.

గట్టుదుద్దెనపల్లిలో కాపర్‌వైరు చోరీ

మానకొండూర్, జూలై 13 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కాపర్ వైరు చోరీకి గురైంది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి సుమారు రూ. 30వేల విలువ గల కాపర్ వైర్‌ను దొంగిలించారు. చంజర్ల ఏఈ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డమ్మీ తుపాకీతో కనిపించిన యువకుడు

● అదుపులోని తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

బీర్‌పూర్, జూలై 13: పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో డమ్మీ తుపాకీతో మండలానికి చెందిన ఓ యువకుడు బీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి వివరాలు తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా బొమ్మ తుపాకీ కలిగి ఉన్న యువకుడు పాఠశాల సమీపంలో కన్పించడంతో అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆ బొమ్మ తుపాకీని ఫొటోషూట్ కోసం అమెజాన్‌లో కొనుగోలు చేశానని తెలుపగా, యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను ఎంఆర్‌పీఎస్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని ఆయనను కోరారు.

కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి మృతి


కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, జూలై 13: కరీంనగర్‌కు చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (89) అనారోగ్యంతో కరీంనగర్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న స్వామి హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. దేశ వ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాముల్లో ఆయన ఒకరు. ఆయన మెట్‌పల్లి ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం సన్యాసం స్వీకరించారు. ఆయన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిషంలో పలు గ్రంథాలు రచించారు. జూలై 2004లో ఆయన సన్యాసాశ్రమం స్వీకరించారు. స్వామి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. స్వామీజీ పార్థివ దేహాన్ని ఆయన కోరిక మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం, నీరుకుళ్ల రంగనాయకస్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సాంప్రదాయం ప్రకారం బృందావనంలో ఖననం చేశారు.

శంషాబాద్‌కు రాజధాని బస్సులు

భగత్‌నగర్, జూలై 13: జగిత్యాల డిపో నుంచి శంషాబాద్‌కు రాజధాని బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సోమవారం నుంచి జగిత్యాల డిపో నుంచి బయలుదేరే రాజధాని బస్సులు ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్‌బీనగర్, మీదుగా శంషాబాద్ చేరుకుంటాయన్నారు. జగిత్యాల నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 4.30, 8.00 గంటలకు, కరీంనగర్ నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 5.45, 9.30 గంటలకు, శంషాబాద్ నుంచి కరీంనగర్/జగిత్యాలకు ఉదయం 7.15, 8.00 గంటలకు బస్సులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఓదెలలో సుబేదర్ గంజ్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

ఓదెల, జూలై 13: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి సుబేదర్ గంజ్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును అధికా రులు శనివారం రెండు గంటల పాటు నిలిపివేశారు. అప్‌లైన్లో వ స్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు న్న కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లైన్ క్లియర్ లేకపోవడంతో, ఉదయం 10 గంటలకు వచ్చిన ఎక్స్ ప్రెస్ రైలు ఓదెలలో నిలిపి వేశారు. 12 గంటల తర్వాత అధికారులు కిలో మీటర్ వెనుకకు పంపించి మరో లైన్ ద్వారా సుబేదార్ గంజ్ వైపు పంపించారు. దీంతో పొత్కపల్లి, కొలనూర్, ఓదెల స్టేషన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే ప్రజలు ఓదెల గేటు వద్దనే ఆగిపోయారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీలోకి శనివారం 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు సామర్థ్యం 90.323 టీఎంసీలకు ప్రస్తుతం 12.556 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.775 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముస్తాబాద్, జూలై 13: మండలంలోని బందనకల్ శివారులో మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గంబీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తుడుము శ్రీనాథ్ (24) 10వ తేదీన బందనకల్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనాథ్ ప్రేమ విషయంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోయడాని ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


గుగులోతు సరోజ (ఫైల్)

వీర్నపల్లి, జూలై 13: మండల కేంద్రానికి చెందిన గుగులోతు సరోజ (55) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సరోజ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త పీర్యా గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు అనారోగ్య సమస్యలు రావడంతో ఆవేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నేరెళ్ల బాధితుడు హరీష్

తంగళ్లపల్లి, జూలై 13: న్యాయం కోసం రిలే నిరాహార దీక్ష చేపడుతున్నాని, దానికి అనుమతి కావాలని నేరెళ్ల బాధితుడు కోల హరీష్ తంగళ్లపల్లి పోలీసులకు శనివారం వినతి పత్రం అందజేశాడు. 2017 సంవత్సరంలో కొతమంది పోలీస్ అధికారులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చిత్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 17వ తేదీన నేరెళ్ల గ్రామ పంచాయతీ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపాడు. దీనికి పోలీసులు అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

జమ్మికుంట, జూలై 13: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఆకుల లక్ష్మి (శీౌ) ఖాళీ వాటర్ బాటిళ్ళు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంది. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

15 మంది మందుబాబుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 13: సిరిసల్ల పట్టణం శాంతినగర్ ప్రాంతంలో శనివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన మందుబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యంబాటి ళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 5 ఆటోలు సీజ్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం మృతి


నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, జూలై 13: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న జర్మన్ షెపర్డ్ సంతతికి చెందిన పోలీస్ జాగిలం ట్యాంగో అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్, పోలీస్ అధికారులు, పోలీస్ డాగ్ హ్యాండ్లర్ లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్యాంగో ఎమిదేళ్లలో జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలు, మొత్తం 99 కేసుల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తో కలిసి ఐఐటీపీ మెయినాబాద్‌లో ఎనిమిది నెలల బేసిక్ ట్రెయినింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూలై 13: కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఈవో ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ బ్యాంక్ పాలకవర్గం పదవీ కాలం రెండు నెలల క్రితం ముగిసింది. కొత్త పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న జీవో విడుదల చేసింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా కరీంనగర్ అదనపు కలెక్టర్ వ్యవహరించనుండగా, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తో పాటు గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, ఎ విద్యాసాగర్, ఇ లక్ష్మణ్‌రాజు, ఎండీ సమియొద్దీన్, మంగి రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుడు గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ బ్యాంక్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది సహకారంతో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్ ఫండ్‌ను మూడు నెలల్లో విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచి ప్రారంభోత్సవంతోపాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచి పరిధిలో ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులను బ్యాంక్ సిబ్బంది ఈ సందర్భంగా సన్మానించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, కాంరెడ్డి రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, సర్దార్ దన్నాసింగ్, పోరండ్ల రమేష్, ఎండీ అమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, అనరాసు కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబానా, లింగమూర్తి, రాజ్‌కుమార్, జ్యోతి, ఇమ్రాన్, షానవాజ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 3: అప్పుల బాధ భరించలేక మండలంలోని మోతె చెరువులో దూకి జగిత్యాల పట్టణానికి చెందిన ఏదుల కిషోర్ (46) ఆత్మహత్యకు చేసుకున్నాడని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కిషోర్ పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో కిరాణం నడుపుతూ జీవిస్తున్నాడు. షాపు నిర్వహణకు ఐదు లక్షల రూపాయలు అప్పు చేశాడు. కొన్ని రోజుల నుంచి దుకాణం నడవడం లేదు. దీంతో చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై తెలిపారు.

● **నమిలకొండలో..**

కొడిమ్యాల: మండలంలోని నమిలకొండ గ్రామానికి చెందిన శతరాసి సురేష్ (39) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు పోలీసులు శనివారం తెలిపారు. సురేష్ కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులో చూపించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథానికి నమస్కరిస్తున్న భక్తులు

రాయికల్, జూలై 13: రాయికల్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు రథయాత్రను ప్రారంభించారు. రథం ముందు రోడ్డును ఊడ్చి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. స్థానిక అంగడి బజార్‌లో ప్రారంభమైన యాత్ర గాంధీ విగ్రహం నుంచి పటేల్ బొమ్మ మీదుగా శివాజీ చౌక్ నుంచి తిరిగి పాత బస్టాండ్ వరకు చేరుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రథయాత్ర కమిటీ సభ్యులు, యువకులు, శ్రీకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ


ధర్మపురి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 13: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానం కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీ సరిపల్లి దర్మవాసవి దంపతులు 1,00,116 రూపాయల శనివారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు.

'చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలి'

తంగళ్లపల్లి జూలై 13: తంగళ్లపల్లి శివారులోని మానేరు నదిలో నిర్మించిన చెక్‌డ్యాం వరదలకు కొట్టుకు పోయిందని, ఆ చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు, గీత కార్మికులు కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాసిరకం పనులతో వరదకు చెక్‌డ్యాం కొట్టుకుపోయిందన్నారు. వ్యవసాయ భూమితోపాటు గీతకార్మికుల తాటి చెట్లు పెంచుతున్న భూమి కోతకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చెక్‌డ్యాం తెగిపోవడంతో ఏర్పడ్డ నీటి గుంతలో పడి చిన్నారులు మృతి చెందారన్నారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవడం తోపాటు త్వరగా మరమ్మతులు చేపట్టి చెక్‌డ్యాంను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడితే తెగిన చెక్‌డ్యాంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఆలోపే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గీత కార్మికులు ఎడ్మాల తిరుమలరెడ్డి, ఎడ్మాల బాల్‌రెడ్డి, బండి సత్తయ్య, కొండయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి, జూలై 13: పట్టణంలోని త్రిశక్తి ఆలయం వార్షికోత్సవాన్ని నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలతో కుంకుమ పూజ జరిపించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్య నారాయణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భూములకు పరిహారం ఇప్పించండి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భూ నిర్వాసితులు

సిరిసిల్ల రూరల్, జూలై 13: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించి తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరారు. సిరిసిల్లలో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబరు 408లో ఉన్న 36 ఎకరాల భూముని మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భూములను కోల్పోయిన తమకు మరోచోట భూములను అందిస్తామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆ భూముల్లో భవనాలను నిర్మించారని, నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీవోను అడిగితే తమపైనే అక్రమ కేసులను పెట్టించారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. తమ భూములకు నష్టపరిహారంతోపాటు మరోచోట భూములను అందించాలని కోరారు. పట్టణ పరిధిలోని విలీన గ్రామాలైన సర్దాపూర్, పెద్దూర్ గ్రామాలు ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని, ఆ గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్నా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూముల్లో నిర్మాణాలను చేపట్టేందుకు పట్టాలను అందించి అనుమతులను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సలేంద్రి బాలరాజుయాదవ్, మెడుదుల దేవయ్యయాదవ్, గొడుగు మల్లేశం, గొడుగు పర్శరాములు, గొడుగు చిన్నఎల్లయ్య, నాగుల లక్ష్మీ, సలేంద్రి రాజ్యలక్ష్మీ, లింగంపల్లి అశోక్, లింగంపల్లి భూలక్ష్మీ, ఎనగందుల ప్రేమల, ఉలిసే తిరుపతి, బడుగు భూమయ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

ధర్మపురి, జూలై 13: ధర్మపురి పట్టణానికి చెందిన మెరుగు శ్రీనివాస్, గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన ఐతం వెంకటేష్ గత నెలలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించిన ఎస్ఐ ఉదయ్‌కుమార్ వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాస్, వెంకటేష్‌కు శనివారం అప్పగించారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు


నారాయణస్వామి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 13: కరీంనగర్ సప్తగిరి కాలనీ మాచర్ల గార్డెన్ వెనుక వైపున ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైందని కరీంనగర్ టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో పెద్దపల్లి నారాయణస్వామి (70), మార్కండేయనగర్ అని చిరునామా ఉందన్నారు. ఆ చిరునామా ప్రకారం ఇంటి నంబర్‌ను తనిఖీ చేయగా ప్రభుత్వ పాఠశాలదిగా వెల్లడైందని తెలిపారు. మృతుడు నారాయణకు సంబంధించిన వారు కరీంనగర్ రెండో టౌన్ సీఐ (8712670762) లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ కె రవీందర్ (9491481433)క సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, జూలై 13: మండలంలోని మామిడాలపల్లిలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన చింతల కిరణ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీలో రేషన్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారని గుర్తించిన పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి తిరుపతి తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి పట్టుకున్నారు. దిరావత్ పాండు, దిరావత్ చందా, దిరావత్ శ్రీను మూడు ఆటోల్లో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాయికల్, జూలై 13: మండలంలోని రాజ్‌నగర్ తండా, ధర్మాజీపేట గాంధీ తండాలలోని నాటుసారా స్థావరాలపై శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ప్రభుత్వం నిషేదించిన గుడుంబా తయారు చేసినా, అమ్మినా, కలిగి వున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం


తునికి శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై 13: మండలంలోని కొత్తపేటకు చెందిన తునికి శేఖర్ (27) అనే యువకుడు దుబాయ్‌లోని షార్జాలో 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్, విదేశాంగ మంత్రి జై శంకర్‌తో మాట్లాడారు. జీడబ్ల్యూపీసీ సమక్షంలో అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, బొడ్డుపల్లి రాములు ఆధ్వర్యంలో యువకుడు పని చేస్తున్న బియ కంపెనీతో మాట్లాడారు. వారి ప్రయత్నంతో శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది.

● జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేష్ (38) ఇరాక్ లో ఇటీవల మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 23న సురేష్‌కు పక్షవాతం రావడంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటుకు గురై చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పు చెల్లించమన్నాడని హత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13: తీసుకున్న అప్పు చెల్లించమన్నందుకు గొడవ తలెత్తింది. ఆ గొడవ కత్తి పోట్లకు దారితీసింది. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందిల్లకు చెందిన చొప్పరి లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన దండె రాహుల్‌రాజ్‌పై శనివారం కత్తితో దాడి చేశాడు. సుందిల్ల గ్రామానికి చెందిన చొప్పరి లక్ష్మణ్ ఇంటికి సమీపంలో ఉండే రాహుల్ రాజ్‌ను అవసరాల నిమిత్తం లక్ష రూపాయలు అప్పుగా అడగగా, అతను ఓ వ్యక్తి వద్ద ఇప్పించాడు.

ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పాడు. గడువు ముగియడంతో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని రాహుల్ పలుమార్లు లక్ష్మణ్‌ను అడిగాడు. శుక్రవారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇవ్వనని తిట్టాడు. రాత్రి రాహుల్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ అతడిపై గొడ్డలితో దాడికి ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. దాడి తర్వాత లక్ష్మణ్ పారిపోయాడు. శనివారం ఉదయం మరోసారి రాహుల్‌రాజ్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ కత్తితో దాడి చేశాడు. దీంతో రాహుల్‌కు కాలిపై, మొహంపై గాయాలయ్యాయి. రాహుల్ కుటుంబసభ్యులు లక్ష్మణ్‌పై కారంపొడి చల్లడంతో అక్కడ నుంచి పారిపోయాడు. రాహుల్‌రాజ్ భార్య ప్రేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చెరువు కట్ట, రహదారి కబ్జా చేశారని రైతుల ఆందోళన


మంథనిలో ధర్నా చేస్తున్న రైతులు

మంథని, జూలై 13: రైతులు తమ వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లేందుకు వినియోగిస్తున్న చెరువుకట్ట, రహదారిని కొంత మంది కబ్జా చేశారని రైతులు మంథనిలోని అబేద్కర్‌చౌక్‌లో శనివారం ఆందోళనకు దిగారు. రైతుల కథనం ప్రకారం.. బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 116లోని 217 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువులోని నీటి ద్వారా మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ధర్మారం, సీతంపల్లి, బిట్టుపల్లి, ఎక్లాసూపూర్, నెల్లిపల్లి గ్రామాల్లోని వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. చెరువు మీద నుంచి పొలాల వద్ద వెళ్లేందుకు కొన్నేళ్లుగా రైతులు చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని వినియోగిస్తున్నారు. చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని ముత్తినేని స్వామి, మాధవరావు కిష్టయ్య, పోగుల శంకరయ్య, ఆకుతోట రాజయ్య అనే రైతులు తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిట్టుపల్లి గ్రామ రైతులు భూమి కబ్జాను అడ్డుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా గత సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి కబ్జా విషయాన్ని వివరించి అడ్డుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కబ్జా స్థలం వద్దకు వెళ్లి పంచనామా నిర్వహించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కబ్జాదారులు దీన్ని పట్టించుకోకుండా చెరువుకట్ట, రహదారి భూమిని తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన రైతులంతా ఏకమై శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకట్ట రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కబ్జాదారులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న మంథని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో రైతులంతా మంథనికి చేరుకొని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. తమ చెరువు కట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని.. తమ రహదారిని పునరుద్ధరించాలని.. వెంటనే తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విరమింపే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. ధర్నా చేసే రైతులతో మంథని తహసీల్దార్ రాజయ్య ఫోన్లో మాట్లాడి సోమవారం వరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషిచేస్తా

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



రైతు వేదిక వద్ద లబ్ధిదారులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్, జూలై, 13 : జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌తో సంక్షేమ పథకాల అమలు కొంత ఆలస్యం జరుగుతుందని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అంటూ కొనియాడారు. అన్ని వర్గా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, మాజీ సర్పంచ్‌లు రాజేందర్‌రెడ్డి, రమణరావు, మాజీ ఎంపీటీసీలు సుధాకర్‌రావు, నర్సింహరెడ్డి, నాయకులు తిరిపెల్లి రాజయ్య పాల్గొన్నారు.

రాళ్లవాగు కుడి కాలువ మరమ్మతులకు టెండర్లు పూర్తి

కథలాపూర్, జూలై 13 : ఏడాది కిందట కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రాళ్లవాగు కుడి కాలువ మరమ్మతులకుగాను ఎట్టకేలకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ కాలువ నీటి ఉధృతికి నక్కల ఒర్రె వద్ద తెగిపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందక పంటలు ఎండిపోయాయి. దీంతో రైతాంగం తీవ్ర నష్టాలకు గురయ్యారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ కాలువ పరిస్థితిపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. తెగిపోయిన ప్రాంతం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో ఉండగా రాగా ఆర్మూర్ ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోకి వస్తుంది. ఆయకట్టు వేములవాడ నియోజకవర్గం కింద ఉన్నందు వల్ల ఇరిగేషన్ శాఖా మంత్రితో మాట్లాడి రు. 21 లక్షలు మంజూరు చేయించారు. పలువురు టెండర్లు దాఖలు చేయగా డేగా కన్‌స్ట్రక్షన్ కంపనీ ఈ పనులు దక్కించుకుందని ఏఈ శేఖర్ శనివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గం



ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కార్యవర్గం

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో శనివారం బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా మంచాల కృష్ణ, అధ్యక్షుడిగా డాక్టర్ ఏ శేలందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బీమయ్యా, చిన్న గంగారాం, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, జాయింట్ సెక్రటరీగా రమేష్, వి. శ్రీనివాస్, కోశాధికారిగా యు. మహేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్‌కే శంషుద్దీన్, నరేశ్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నుంచి ఎన్నికల పరిశీలకుడిగా ఇంతియాజ్ ముస్తాక్ అలీ వ్యవహరించారు. అనంతరం విరూపాక్షి గార్డెన్స్‌లో మొక్కలు నాటారు. రానున్న మూడు, నాలుగు నెలల్లో జగిత్యాల కేంద్రంగా బాడీ బిల్డింగ్ కాంపిటేషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


ఎంపీ అర్వింద్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఎంపీ అర్వింద్‌ను పరామర్శిస్తున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి, జూలై, 13 : పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి కొద్ది సేపు మాట్లాడారు. డీఎస్ మృతిపై ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య స్థాయి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప ఆదర్శప్రాయుడని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర చాలా విలువైందని, అలాంటి నాయకుడు మృతి తీరని లోటన్నారు.

జాతీయ సేవారత్న అవార్డును అందుకున్న భాస్కర్



పేట భాస్కర్‌కు అవార్డును అందిస్తున్న నిర్వాహకులు

కోరుట్ల, జూలై 13 : ప్రజాసంఘాల జేఏసీ, అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ జాతీయ సేవారత్న అవార్డును శనివారం అందుకున్నాడు. హైదరాబాదులోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాస్కర్‌కు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సంస్థ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్‌లతో పాటు సంస్థ డైరెక్టర్ల చేతుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. భాస్కర్‌ను పట్టణానికి చెందిన ప్రముఖులు సన్మానించి అభినందించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూలై 13 : వేములవాడ రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామిని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం దర్శించుకున్నారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు ప్రసాదాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీమ్‌లోకి తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. అంతకుముందు ఎంపీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. ఏఈవో ప్రతాప నవీన్, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా అంగన్‌వాడీలు

- సులభతరంగా సిలబస్‌లో మార్పు
- టీచర్లకు పాఠ్య ప్రణాళిక పుస్తకాలు పంపిణీ
- ఆటా, పాటలతో ప్రత్యక్ష పద్ధతులకు ప్రాధాన్యం

కథలాపూర్, జూలై 13 : కేంద్ర శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ సిఫార్సు మేరకు జాతీయ విద్యా విధానం 2020కు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కరికులంను మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు సులభమైన పద్ధతుల్లో బోధన చేసి సమగ్రాభివృద్ధిని సాధించాలని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు రూపాంతరం చేయనున్నారు. ఈ మేరకు జూన్ నుంచి ఆగస్టు దాకా నాలుగు నెలల సిలబస్‌ను మొదటి విడతలో విడుదల చేశారు. ఇప్పటికే జిల్లాలోని పలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో అంగన్‌వాడీ టీచర్లకు నూతన సిలబస్‌పై శిక్షణా తరగతుల నిర్వాహణ కూడా పూర్తయింది.

● ప్రియదర్శిని పేరిట హ్యాండ్ బుక్

పిల్లల్లో అభ్యసనం సులభతరం చేయడానికిగాను ఆటా, పాటలు, ప్రత్యక్ష అనుభవాల ద్వారా మానసిక ఉల్లాసం కల్పించడానికి ప్రియదర్శి ని పేరిట హ్యాండ్ బుక్‌ను రూపొందించారు. టీచర్లకు సహాయకారిగా ఉండడానికి 9 అంశాలతో 43 వారాల ప్రణాళికలను తయారు చేశారు. చిన్నారుల్లో ఎప్పటికప్పుడు మానసిక అభివృద్ధిని పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. అటు పౌష్టికాహారం అందిస్తూనే పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహాసభ, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, ప్రథమ్ రిలయన్స్ ఫౌండేషన్, అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్‌ల సహకారంతో ఈ పాఠ్య ప్రణాళిక తయారు చేశారని మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జూన్‌లో సంభాషణ, పాటలు, కథలు, ఆటలు, సృజనాత్మకత, జూలైలో నేను, నా శరీరం, మంచి అలవాట్లు, సంభాషణ, పాటలు, పూర్వ గణిత భావన, కథలు, నా కుటుంబం వంటి అంశాలను చేర్చారు. ఆగస్టులో మా ఊరు, మా ఇల్లు, పరిసరాలు, పండగలు, పంటలు, వృత్తులు, సదుపాయాలు అదేవిధంగా సెప్టెంబర్‌లో మొక్కలు, చెట్లు, జంతువులు, పక్షులు, ఆహారపు అలవాట్లు, బంధువులు వంటి అంశాలలో ప్రణాళిక తయారు చేసి కేంద్రాల్లో బోధన అరంభించారు.



అంగన్‌వాడీ కేంద్రం

● కొత్త పాఠ్య ప్రణాళికపై శిక్షణ పూర్తి

రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు కొత్తగా అమలు చేసే పాఠ్య ప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు జిల్లాలో శిక్షణ పూర్తయింది. మహిళా శిశు, సంక్షేమ శాఖ సరఫరా చేసిన పుస్తకాలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశాం, నూతనంగా రూపొందించిన సిలబస్ చాలా సులభంగా పిల్లలకు అర్థమయ్యేలా ఉంది. పూర్వ ప్రాథమిక దశలో బడి వాతావర ణానికి అలవాటు చేసే విధంగా రూపొందించారు.

ఆటా, పాటలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల చిన్నారులు ఉల్లాసంగా నేర్చుకోడానికి సంసి ద్ధులుగా ఉంటారు.

యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

-ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విజేత జట్టుకు ట్రోఫీని బహుకరిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మన్ కుమార్

గొల్లపల్లి, జూలై 13 : నేటి యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పురంశెట్టి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని రూపొందిస్తాయని, యువతీ యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతుందని ఈ అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చాటి చెప్పాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గౌతమ్ చూపుతున్న ప్రత్యేక చొరవ అభినందించదగ్గదన్నారు. తమ గ్రామంలో కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని తాజామాజీ సర్పంచ్ పురంశెట్టి పద్మవెంకటేశం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి అతి త్వరలో అన్ని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్రికెట్ టోర్నీలో ప్రథమ విజేతగా నిలిచిన వెన్నుమట్ల జట్టుకు ట్రోఫీతో పాటు షీల్డ్‌ను బహుకరించారు. రెండో విజేతగా నిలిచిన అబ్బాపూర్ జట్టుకు ట్రోఫీతో పాటు షీల్డ్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజేత జట్లను అభినందిచారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిశాంత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు తిరుపతి పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి సహకరించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న అడ్లూరి

బీర్‌పూర్, జూలై 13: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరిస్తామని అందుకు రెండు గ్రామాల ప్రజలు సహకరించాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయి గిరిజనులకు, ధర్మపురి మండలంలోని ఆరేపెల్లి గ్రామస్థుల మధ్య ఉన్న 110 ఎకరాల భూ సమస్య విషయంలో రెండు గ్రామాల ప్రజలతో రెవెన్యూ అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల సహకారంతో ఇరు వర్గాల వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరిస్తామని దానికి అందరు సహకరించాలని రెండు గ్రామాల ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుడిగా ఉన్నప్పుడు ఎందుకు అభివృద్ధి చేయలేదు

ఎమ్మెల్యేను ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, జూలై 13 : టీటీడీ సభ్యుడిగా ఉన్నపుడు విద్యాసాగర్ రావు నియోజకవర్గంలోని దేవాలయాలతో పాటు టీటీడీ కళ్యాణ మండపాలను ఎందుకు అభివృద్ధి దిశగా నడిపించలేదని కాంగ్రెస్ నాయకులు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో పంపిన ప్రతిపాదనలతో దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని చెప్పడం విడ్డూరమన్నారు. విద్యాసాగర్ రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణంలో నిర్మాణం చేసిన టీటీడీ కళ్యాణ మండపాలు ఎందుకు అభివృద్ధి చేయలేదని వాటికి నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుటుంబం కమీషన్ల కోసం పని చేసిందని తప్ప చేసిందేం లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి జువ్వాడి సోదరులు తీసుకుపోయి దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా చొరవ చూపారన్నారు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ జడ్‌పీటీసీ సభ్యులు తోట గంగాధర్ కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, గడ్డం వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శంకర్, లింబాద్రి రిజ్వాన్, మంతెన గంగనర్సయ్య, సుదీర్, జనార్ధన్, పుల్లూరి వెంకటేష్, లక్ష్మన్, నరేష్, గంగాధర్, రసూల్, రాజం పాల్గొన్నారు.

జువ్వాడి కృష్ణారావుపై మాట్లాడే స్థాయి ఎమ్మెల్యేది కాదు

మెట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుపై కోరుట్ల ఎమ్మెల్యే మాట్లాడే స్థాయి కాదని పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం హిత వు పలికారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జువ్వాడి కృష్ణారావు పై ఎమ్మెల్యే మాట్లాడడాన్ని ఖండించారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా ఉండగా వీఐపీ దర్శనం టికెట్లు, సుప్రభాత సేవలు కార్యాలయం సిబ్బంది లోకల్ వాళ్లకు ఇవ్వలేదన్నారు. తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన నిధుల ప్రొసిడింగ్ పత్రాలను గ్రామాల్లో అందజేయడాన్ని ప్రపంచం తలకిందులైనట్టుగా ఎమ్మెల్యే హోదాలో ఉండి మాట్లాడడం పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, జెట్టి లక్ష్మణ్, ఆడెపు రమణ, జాజాల రాజ్‌కుమార్, షేక్ జాకీర్, శేఖర్, నాయకులు, పాల్గొన్నారు.

గీతా పారాయణంతో మానసిక ప్రశాంతత

మెట్‌పల్లి, జూలై, 13 : గీతా పారయణం చేయడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని గీత ప్రబోధక్ చిలమంతుల చత్రపతి అన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణ కేంద్రంలో 78వ గీత జ్ఞాన యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణ పరమాత్ముడికి 108 రకాల ప్రసాదాలు నైవేద్యాలు సమర్పించినంతరం పుష్ప అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజ కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా గీత సదస్సులోని ప్రతి శ్లోకాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరు పెద్దల పట్ల గౌరవం భక్తి భావనతో ఉంటారని, మనిషి ఎదుగదలలో గీతా పారాయణం ఎంతో ప్రోత్సాకరంగా ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహజన్ నర్సింహులు, దొంతుల రాజుకుమార్, కౌన్సిలర్ చెట్లపల్లి మీనా-సుఖేందర్‌గౌడ్, మర్రి బాస్కర్, పోలీస్ శ్రీనివాస్, రాంభూపాల్, మహజన్ శివకుమార్, మహజన్ హరీష్, గాదె రమేష్, మహిళలు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలరూరల్, జూలై 13 : ఎల్‌వోసీతో నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి మోకాలు కీలు సమస్యతో బాధపడుతున్నాడు. ఆర్థికంగా శస్త్ర చికిత్స చేసుకునే స్తోమతలేకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 80 వేల విలువ గల ఎల్‌వోసీని అందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, నాయకులు జాన్, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, గంగన్న, రాజేష్, పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో ప్రభుత్వ విప్ పర్యటన

ముస్తాబాద్, జూలై 13: ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పర్యటించారు. నామాపూర్‌లోని కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి నివాసంలో భోజనం అనంతరం ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. సెల్ఫీలకు పోటీ పడ్డారు. కులసంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. బీజేపీ అధ్యక్షుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఐఎంఎ జిల్లా మాజీ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ చింతోజు రాజారాం, డాక్టర్ చింతోజు అర్చన మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డిని, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బుర్ర రాములు అనారోగ్యానికి గురికాగా వారి ఇంటి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతి, గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి శీల భాను, దీటి నర్సింలు నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను దహనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ఎల్లారెడ్డిపేట, జూలై 13: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు నాటేందుకు తీసుకు వచ్చిన 1000 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం దహనం చేశారని ఆ శాఖ అధికారులు, స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు సమీప అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ పనులను చేపట్టారు. మొక్కలను నాటేందుకు 1000 మొక్కలను తీసుకొచ్చి సిద్ధంగా ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ మొక్కలపై కట్టెలు వేసి నిప్పు పెట్టారు.

సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. అటవీ భూములను సాగు చేసుకోవాలనే ఉద్దేశంతోనే కొందరు మొక్కలను దహనం చేశారని గుర్తించామని ఎఫ్ ఎస్‌వో బాపురాజు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గేదె మృతి

పెగడపల్లి, జులై 13 : మండల కేంద్రంలో శనివారం వీధి కుక్కల దాడిలో గేదె మృతి చెందింది. మండల కేంద్రానికే చెందిన నేదరి పోచయ్యకు చెందిన చిన్న గేదెను వీధి కుక్కలు వెంట పడి మూకుమ్మడిగా దాడి చేయడంతో మృతి చెందింది. ప్రభుత్వం కుక్కల బెడదను నివారించాలని, మృతి చెందిన గేదెకు ప్రభుత్వ పరంగా తనకు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ఆకట్టుకుంటున్న పులుల వేషధారణలు

భీమారం, జూలై 13: మొహర్రం పండుగ సందర్భంగా భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు, చిన్నారులు వేసిన పులుల వేశధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా గ్రామాల్లోని పీరీల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 13 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శనివారం రాత్రి సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు అకౌంట్ నంబర్లు, అపరిచి తులకు చెప్పవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. అనంతరం సైబర్ కేసులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

జగిత్యాల అర్బన్, జూలై 13: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎల్‌ఎల్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర ఐకోపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య నాన్ జాయినింగ్, లెఫ్ట్ ఓవర్ పోస్టులు వెంటనే అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని వీలయినంత తొందరగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని విద్యార్థులకు జరిగే నష్టాన్ని భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, భూమేశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కోశాధికారి మానుపాటి బన్న, కార్యదర్శులు ఆగమయ్య, ప్రసాద్, శ్రీధర్, నరేష్, అనిల్, సత్యనారాయణ తదితరులున్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నేత భోగ గోవర్ధన్



మాట్లాడుతున్న బీడి వర్కర్స్ ఫెడరేషన్ నేత భోగ గోవర్ధన్

కోరుట్ల, జూలై 13 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని బీడీ వర్కర్స్ పెడరేషన్ నేత భోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో వివిధ కార్మిక సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములుతో కలిసి ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న బీడి వర్కర్స్ పెడరేషన్ నేత గోవర్ధన్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బీడి కార్మికుల ఓట్ల కొసం ఎన్నో వాగ్దానాలు చేసి వాటి అమలు మరిచిందని అన్నారు. పీఎఫ్ ఉన్న బీడి కార్మికుల రాజీనామాల అనంతరం పదవి విరమణ పెన్షన్ రూ. 5,000కు కేంద్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రధాని అవాస్ యోజన పథకంగా ద్వారా కార్మికులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు సంక్షేమ ద్వార ఉచిత వైద్య సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో బీడి వర్కర్స్ పెడరేషన్ నేతలు ముక్రం, మౌలానా, కదారి రాములు, కొక్కుల శాంత, కేవి అనసూయ, రాంగారెడ్డి, లక్ష్మణ్, అజ్జవేణు, బాను ప్రసాద్, దేవదాస్, ఎన్నం రాధలతో పాటు పలువురు పాల్గొన్నారు.